# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 25 నవంబరు , 2025 | పేజీలు : 06





సూర్యాపేట పోరాటాల ఖిల్లా...

# మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

## భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/బీబీనగర్ : యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రతి మహిళా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం ఫేమస్ ఫంక్షన్ హాల్‌లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ జయంతి రోజున ముఖ్యమంత్రి చీరాల పంపిణీ ప్రారంభించారని గత ప్రభుత్వం సంక్షేమాన్ని మరిచి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, మహిళా సంక్షేమం కోసం ఎలాంటి కృషి చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం మండలంలో 1450 మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారని 770 మంది సభ్యులు కాని వారు ఉన్నారని, సభ్యులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ మహిళా చీర పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సంఘాల్లో 45 మంది విబికేలు పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బోనగిరి గ్రంథాలయ చైర్మన్ యండి.ఆవేజుచిస్తి, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, డిఆర్‌డిఏ నాగిరెడ్డి, తాసిల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రజావాణి ఏపీవో వాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగళి రెడ్డి, రామాంజనేయులు గౌడ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీలో ఎమ్మెల్యే

ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండల కేంద్రంలో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి గత ప్రభుత్వం సంక్షేమం మరిచి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని మహిళా సంక్షేమం కోసమే ఎలాంటి కృషి చేయలేదని విమర్శించారు. మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు, అర్హులందరికీ రేషన్ కార్డు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంటు, రుణాలు అందించి ప్రోత్సహించి మహిళలను కోటీశ్వరులుగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, మందాడి ఉపేందర్ రెడ్డి, జిల్లా మండల కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మార్వో దశరథ, ఎంపిడిఒ పాల్గొన్నారు.





# రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాకు 26.34 కోట్ల వడ్డీ లేని రుణాలు

## నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రజాపక్షం/నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇదివరకే రెండు విడతల్లో వడ్డీలేని రుణాలు పంపిణీ చేయగా ,మంగళవారం మరోసారి మూడో విడత పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయనుంది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 304 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నది.ఈ విషయంపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఆర్‌డిఓలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈ విషయం తెలియజేశారు.జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో ఇందిరా మహిళల శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ జిల్లాకు మూడు లక్షల 66,000 చీరలు రాగా, 3 లక్షల చీరలను ఇదివరకే పంపిణీ చేయడం జరిగిందని, సోమవారం రాత్రి వరకు గ్రామస్థాయిలో చీరల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలిపారు .వడ్డీ లేని రుణాల కింద నల్లగొండ జిల్లాకు రాష్ట్రంలోనే అత్యధికంగా 26.34 కోట్ల రూపాయలు విడుదల చేయడం పట్ల ఆమె ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో మూడవ విడత వడ్డీ లేని రుణాలు పంపిణీ కార్యక్రమాన్ని సవ్యంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమానికి వారిని ఆహ్వానించాలని చెప్పారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి,గృహ నిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, తదితరులు హాజరయ్యారు.

# ప్రణాళికతో ప్రమాదాలు నివారిస్తాం

## రోడ్డు ప్రమాద స్థలాలను పరిశీలించిన జిల్లా ఎస్పి కె నరసింహ

ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) : తిరుమలగిరి మున్సిపాలిటి కేంద్రంలో రోడ్డు ప్రమాద స్థలాలను సోమవారం జిల్లా ఎస్పి కె నరసింహ ఫైనాన్స్ కమీషన్ సభ్యులు సుధీర్ రెడ్డి, సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, తిరుమలగిరి మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. అరైవ్‌ఎలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి మున్సిపాలిటి కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి ముందుకు వెళ్తామని ఎస్పి తెలిపారు. సూర్యాపేట జనగామ రహదారిపై నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డుపై 22 మధ్యంతర ఓపెనింగ్‌లు ఉన్నాయని వీటి ద్వారా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనాలు వేగంగా వచ్చే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. వీటి నివారణ కోసం మున్సిపాలిటి మండల కేంద్రంలో ప్రత్యేక రోడ్డు నివారణ కమిటిలను ఏర్పాటు చేస్తామని ప్రణాళిక ప్రకారం ముందుకెళ్లి ప్రమాదాలను నివారిస్తామని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి అరైవ్ ఎలైవ్ అని అవగాహన కార్యక్రమాన్ని తీసుకొచ్చారని దీని ద్వారా ప్రజల్లో విస్తృతంగా రోడ్డు భద్రతపట్ల అవగాహన కల్పిస్తామని అన్నారు.



# సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం




## సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

ప్రజాపక్షం/మునుగోడు: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు.సోమవారం సిపిఐ కార్యాలయంలో నారాయణపురం మునుగోడు,చింతపల్లి,కట్టంగూర్ మండలాలకు చెందిన ఎనిమిది మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ తో పాటు రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగానికి పెద్దపీట వేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమూర్తి శ్రీనివాస్,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురుజ రామచంద్రం, బులుగూరి నరసింహ,తీర్పారి వెంకటేశ్వర్లు,సిపిఐ జిల్లా సమితి సభ్యులు బిలాలు,సురిగి చలపతి,మండల కార్యదర్శి చాపల శ్రీను,మండల సహాయ కార్యదర్శి మందుల పాండు,ఈదులకంటి కైలాస్,దుబ్బ వెంకన్న,వనం వెంకన్న,చిర్రగొని శంకర్,కట్కూరి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఫిర్యాదుదారుల సమస్యల సత్వర పరిష్కారానికి పోలీస్ అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పి కె నరసింహ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాల యంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన ఫిర్యాదుదారుల నుండి ఫిర్యాదులను స్వీక రించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టాన్ని అమలుపర్చడంలో ఎలాంటి అలసత్వం చూపరాదన్నారు. ప్రతి కేసును పారదర్శకంగా ఇన్వెస్టిగేషన్ చేయాలని సూచించారు. గ్రీవెన్స్ డే ద్వారా వచ్చిన ఫిర్యాదుల స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికై కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.



## జిఓ నె.46 బిసిలకు గుదిబండలా మారింది

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నల్లగొండ జిల్లా మొత్తం 869 గ్రామపంచాయతీలు ఉండగా 2019లో బీసీలకు 164 రిజర్వ్ అయ్యాయని, ఇప్పుడు కేవలం 140 మాత్రమే రిజర్వ్ అయి 24 తగ్గించాలని జీవో బీసీకు గుదిబండలా మారాయని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ సోమవారం అన్నారు.రిజర్వేషన్ల కేటాయింపులో రొటేషన్ విధానం బీసీలు చాలా నష్టపోయారని అన్నారు. బీసీల సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు కాకుండా అగ్రకుల పార్టీలు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

## చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ముక్తాపూర్ గ్రామంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు దారెడ్డి దామోదర్ రెడ్డికి రూ.60వేలు, సిద్ధగోని సత్తయ్య రూ.28 వేలు, మునుకుంట్ల ఆండాలు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిల్ దారెడ్డి మంజుల వేణు గోపాల్ రెడ్డి, పోచంపల్లి టోన్ కార్యదర్శి మోడేపు అశోక్ గౌడ్, మునుకుంట్ల రఘు గుండ్ల కుమార్ గౌడ్, గుండ్ల వేణు సుధాకర్ రెడ్డి, కొండమడుగు రామేశ్వర, లక్మయ్య పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి గాయాలు



**ప్రజాపక్షం/మోటకొండూరు** : మోటకొండూరు మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు వంగాల చంద్రమౌళి గౌడ్ వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి మెర వేస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి తాటి చెట్టు పై నుండి కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అతనికి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా రావాల్సిన ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేసి ఆదుకోవాలని ఎక్సైజ్ ఉన్నతాధికారులను కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తండా పాండురంగం, స్థానిక సొసైటీ అధ్యక్షులు గాజుల బాలరాజు, ఉపాధ్యక్షులు లోడే ఉప్పలయ్య, కార్యదర్శి వంగాల స్వామి, డైరెక్టర్లు రుద్రబోయిన మల్లేశ, బోల్లపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

## మేడి గోపాల్ దశదినకర్మ

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని ఉత్తటూరు గ్రామానికి చెందిన మేడి గోపాల్ దశదినకర్మకు మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్‌బాబు హాజరై కుటుంబసభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించి ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందచేయడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు జెట్టి సైదులు, రైతు విభాగం మండల అధ్యక్షుడు జంగిలి నరసింహా, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కోళ్ల కిషన్, నాయకులు పొనుగోటి శ్రీనివాస్ రావు, బందెల నరసింహా, మేడి రాజు, బందెల లింగ స్వామి, బైరబోయిన వీరస్వామి, మల్లెబోయిన వెంకన్న, మేడి యాదయ్య, కోళ్ల కిష్టయ్య, మేడి రామ చంద్రం తదితరులు ఉన్నారు.



## పంట కోసుకొని పోయిన వారిపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అక్రమంగా తన పంటను కోసుకోని పోయిన వారిపై చర్యలు తీసుకోని పోయిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు రామాంజి జ్యోతి సోమవారం ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌కు ఫిర్యాద చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామ శివారులో గల సర్వే నెం.129/73లో 0.34గుంటల భూమి మాకు వారసత్వంగా రాగా సాగు చేసుకుంటున్నామని, ఈనెల 16న గ్రామానికి చెందిన ఇరుగుదిండ్ల నాగమ్మ, ఇరుగుదిండ్ల నాగేష్, ఇరుగుదిండ్ల అనురాదా, కుంచం దేవితోపాటు పది మంది నా పంట పొలాన్ని కోసుకోని పోయేందుకు కోత మిషన్‌తో వచ్చి నాపై దుర్భాషలాడి దాడి చేశారని అన్నారు. చికిత్స నిమిత్తం కొన్ని రోజులు హైద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందానన్నారు. అక్రమంగా మాపై దాడి చేసి పంటను కోసుకోనిపోయిన వారిపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య ఉన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మహిళలకు గౌరవం





**ప్రజాపక్షం/సూర్యాపేట (సూర్యాపేట రూరల్) :** ఇందిరమ్మ కాలం నాటి నుండి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ హయాంలోనే దేశంలో మహిళలకు మంచి గౌరవం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మాలి అనంతరెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట మండల పరిధిలో గల రామచంద్రాపురం గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మహిళలకు చీరలను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు చింతల పాపయ్య, పేరెల్లి శ్రీరాములు, చౌగోని సోమనర్సమ్మ, గ్రామ సంఘంబంధం అధ్యక్షురాలు, గ్రామ కార్యదర్శి సంఘబంధ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మోతె :** ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి మహిళను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో పాల్గొన్న ఆయన మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మండలంలో 972 పొదుపు సంఘాలు ఉండగా 10,052 మంది సభ్యులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుప్పరాజు సతీష్, మాజీ ఉపసర్పంచ్ బొర్ర మధుసూదన్, నంది గామ కృష్ణారెడ్డి, గ్రామ కార్యదర్శి భూలక్ష్మి , గ్రామ పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## జిఓ కాపీలను దగ్ధం చేసిన బిసి జెఎసి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బిసి రిజర్వేషన్లు తగ్గించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జిఓ నెంబర్ 46 పత్రులను, జిల్లా బిసి జెఏసి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహం వద్ద దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిసి జెఏసి జిల్లా కోఆర్డినేటర్, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నర్సింహ మాట్లాడుతూ 60 శాతం ఉన్న బిసిలను అన్యాయం చేస్తూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసిలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా అదికారంలోకొచ్చి రెండు సంవత్సరాలు కాలయాపన చేశారని మండిపడ్డారు. బిసి సంఘాల ఒత్తిడితో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేమని ఆలోచించి తూతూ మంత్రంగా రాజ్యాంగబద్ధంగా వెళ్ళకుండా అసెంబ్లీలో బిల్లుపెట్టి ఆమోదింప చేసుకొని గవర్నర్‌కు పంపి చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారబోయిన వెంకట్ యాదవ్, యాతాకుల రాజయ్య, దాసరి దేవయ్య, బండపల్లి శ్రీనివాస్, చిలివేరు నరసింహారావు, దాసరి వెంకన్న యాదవ్, జంపాల వెంకటేశ్వర్లు, దైద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## బీరెల్లి కృష్ణారెడ్డికి నివాళులర్పించిన ఉప్పల



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మాజీ తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ సీనియర్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మామ బీరెల్లి కృష్ణారెడ్డి దశదినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్ గుప్తా, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, బీరవోలు సోమిరెడ్డి, పోతుగంటి వెంకటేశ్వర్లు, కమలాకర్, లక్ష్మి కాంత్ పాల్గొన్నారు.



## మిర్యాలగూడ వాసికి అవార్డు రావడం అరుదైన గౌరవం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ వాసికి జాతీయ స్థాయిలో అవార్డు రావడం అరుదైన గౌరవమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు అన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాతీయ స్థాయి ఉత్తమ జర్నలిస్టు అవార్డు పొందిన పుట్ల నాగేశ్వర్‌రావును వారు శాలువా, పూలమాల, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. జర్నలిస్టు రంగంలో ఆయన చేసిన కృషికి తగిన గుర్తింపు లభించినట్లు అయిందని అన్నారు. అవార్డు రావడంతో నాగేశ్వర్‌రావుకు మరింత బాధ్యత పెరిగిందని, భవిష్యత్తులో ఇదే ఉత్సాహంగా పని చేసి ఇంకా అవార్డులు పొందాలని కోరారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ కోకన్వీనర్ మురళీయాదవ్, ఎంఈవోలు బాలాజీనాయక్, వెంకన్ననాయక్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరద్‌నాయక్, బీసీ సంఘం నాయకులు సిరిసాల శ్రీనివాస్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎన్ఎం జిల్లా మహాసభలన జయప్రదం చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అన్నారు. సోమవారం ఆయన మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబర్ 6,7 తేదీల్లో మాడుగులపల్లిలో ప్రజానాట్యమండలి జిల్లా 8వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజానాట్యమండలి ఎంతో కృషి చేస్తుందన్నారు. గ్రామీణ జానపద కళలను తట్టి లేపేందుకు కళాకారుల్లో చైతన్యాన్ని పెంపొందింపచేస్తున్న పీఎన్ఎం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ మహాసభలకు కళాకారులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, పీఎన్ఎం జిల్లా కార్యదర్శి కుమ్మరి శంకర్, నాయకులు పుట్టల సైదులు, పల్ల ప్రసాద్, కుమ్మరి సైదులు, బసవరాజు వెంకన్న, జడ వెంకటయ్య, మంద మోసు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ఎమ్మెల్యే ఫోన్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మద్యం షాపులను పట్టణ ప్రధాన కూడలిలో కాకుండా దూరంగా నడుపుకోవాలని కోరుతూ గత నెల రోజులుగా పోచంపల్లి పట్టణంలోని వివిధ సంఘాలు, యువజన సంఘాల నాయకులు మహిళా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఎంపీ, ఎమ్మెల్యే, ఎక్సైజ్ శాఖ సిబ్బందికి వినతులు సమర్పిస్తునా కూడా మద్యం దుకాణాలు నడుపుతున్న యజమానుల నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ సోమవారం పట్టణ కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అదే సమయంలో ఎమ్మెల్యే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న ఆయనకు అడ్డుకోగా సమస్యను వివరించిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి వెంటనే మద్యం దుకాణాలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలని లేదంటే షాపులకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. దీంతో నేడు తలపెట్టే ధర్నాను విరమించుకున్నారు.





## నర్సమ్మ మృతదేహానికి నివాళులు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని ఇంద్రపాల నగరం గ్రామానికి చెందిన గుత్తెదారు నర్సింహా భార్య బోదాసు నర్సమ్మ మృతిచెందగా ఆమె మృతదేహాన్ని మాజీ ఎంపీపీ పూస బాలమణి బాలనరసింహా, వలిగొండ, రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం, సింగిల్‌విండో డైరెక్టర్ నాగు ఆంజనేయులు, ఉప సర్పంచ్ గర్దాసు సురేష్, మందడి గోపాల్‌రెడ్డి, ఈర్లపల్లి మల్లయ్య, శివగల్లా ముత్యాలు, బోదాసు ఎల్లయ్య, పబ్బు నరేష్, నల్ల పరుశురాములు, నల్ల ఎల్లేష్, శివగల్లా జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## బిసిలకు న్యాయం జరిగే వరకు పోరాటం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** బిసిలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా. చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టసభల్లో అమలు చేయాలని సోమవారం ఆయన వివిధ బిసి సంఘాలు, బిసి కుల సంఘాల నాయకులతో కలిసి మండల కేంద్రంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి చౌరస్తాలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, బిసి సంఘం నాయకులు ఏరుకొండ రాము, బొడిగె శంకర్‌గౌడ్, కోట్ల జగదీష్‌పటేల్, ఎంఎ కైసర్‌ఖాన్, నూతనగంటి ఈశ్వర్, పెద్దిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

## గ్రామ కంఠం భూమి కబ్జాపై కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామంలో గ్రామ కంఠం భూమిని కబ్జా చేసి ఇల్లు నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని అంబాల గ్రామ యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు అంబాల కరుణాకర్ సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబాల గ్రామానికి చెందిన కట్కూరి భాష గ్రామ కంఠం భూమిని కబ్జా చేసి ఇల్లు నిర్మాణానికి ముగ్గు పోసి ఇల్లు నిర్మించేందుకు సిద్ధం చేశారని ఈ విషయమై పంచాయతీ రాజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని అన్నారు. ఇట్టి విషయమై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు డిఎల్పివో శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. గ్రామ కంఠం భూములను కాపాడాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.



# అక్క, తమ్ముడి మధ్య గొడవ చంపేందుకు సిద్ధమైన తమ్ముడు

**ప్రజాపక్షం/మునగాల:** తన తల్లి అక్కకు నాకు తెలియకుండా డబ్బులు ఇవ్వడంతో తల్లి, కూతుళ్ల మధ్య చిన్న గొడవ జరగడంతో చిలికి చిలికి గాలివానల తయారై చివరకు చంపుకునేందకు సిద్ధమైన సంఘటన మునగాల మండలం బరాకత్‌గూడెం గ్రామంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని బరాఖత్ గూడెం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి కళావతి కుమార్తె రణబోతు జ్యోతికి సుమారు 18 లక్షల రూపాయలు, 20 తులాల బంగారం కుమారుడు ఉపేందర్‌రెడ్డికి తెలియకుండా ఇచ్చింది. గత సంవత్సరంలో తల్లి కూతుళ్ల మధ్య చిన్న తగాద జరగడంతో చివరకు తల్లి కళావతి కుమారుడు ఉపేందర్‌రెడ్డికి తెలియజేసింది. ఈ విషయం చిలికి చిలికి గాలివాన తయారు కావడంతో పాటు ఇద్దరు కసి పెంచుకున్నారు. ఈ విషయమై పలువురు నాయకులు కోదాడ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిని సంప్రదించగా వారు ఇరువురికి సర్దిచెప్పి కొంత డబ్బును తల్లి కళావతికి అందజేయాలని కుమార్తె జ్యోతికి చెప్పి వారి మధ్య ఒప్పంద పత్రం రాపించారు. మా అక్క దగ్గర నుండి ఇంకా డబ్బులు రావాలని ఉపేందర్‌రెడ్డి తన అక్కకు ఇచ్చిన మూడు ఎకరాల పొలంను అడ్డుకోవడంతో పాటు వరి మిషన్ డ్రైవర్‌ను కిందకు దించడంతో పాటు అక్క, బావ, కోడళ్లపై దాడికి దిగడంతో పలువురికి గాయాలయయ్యాయి. దీంతో ఆదివారం సాయంత్రం కుమార్తె రణబోతు జ్యోతి ఫిర్యాదు మేరకు మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమారు కేసు దర్యాప్తు ప్రారంభించి తల్లి కళావతి, తమ్ముడు ఉపేందర్‌రెడ్డి లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన




**ప్రజాపక్షం/అర్వపల్లి :** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఈట సైదులు అన్నారు. సోమవారం స్థానిక జడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీ టీం బృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాల మాటలు నమ్మి డబ్బు పోగొట్టుకోవద్దని, ఓటిపిలు ఎవరికి చెప్పవద్దని సూచించారు. బ్యాంక్ ఎకౌంట్‌కు కెవైసి చేస్తామంటూ వచ్చే ఫోన్లు కట్ చేయాలన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని విద్యార్థులు అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఎవరైనా ఫోన్ చేసి వేధించినా అసభ్యకరంగా ప్రవర్తించిన 100 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు జరిగితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు మధుకర్, కానిస్టేబుళ్లు రమణ, గోపయ్య, మణికుమార్, కళాబృందం ఇంచార్జి ఎల్లయ్య, సభ్యులు గోపయ్య చారి, సత్యం, కృష్ణ, నాగార్జున, గురులింగం, పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మట్టిలో మెరిసిన మాణిక్యం శివ దీక్షిత్

**కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు .. దీనికి నిదర్శనం శివ దీక్షిత్**



**ప్రజాపక్షం/చండూరు:** పట్టుదలకు ప్రతిరూపం తల్లి దండ్రుల రోత్సాహం కలగలసి మట్టిలో మెరిసిన మాణిక్యం బొమ్మరబోయిన శివ దీక్షిత్ . నల్లగొండ జిల్లా చండూరు మండలం కస్తాల గ్రామానికి చెందిన బొమ్మరబోయిన సైదులు కవిత దంపతుల మొదటి సంతానమైన శివ దీక్షిత్ చండూరు మండల కేంద్రంలోని కృష్ణవేణి స్కూల్ లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం నల్లగొండ లోని మేకల అభినవ్ అవుట్ డోర్ స్టేడియం లో హెచ్‌సిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 బాలుర క్రికెట్ టీం సభ్యుల ఎంపికలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి నల్లగొండ జిల్లా టీంకు ఎంపిక కావడంతో పాటు జట్టుకు వైస్ కెప్టెన్ గా ఎన్నిక కావడం ఎంతో సంతోషకరమైన విషయం అని చెప్పవచ్చు . కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అన్నది అక్షరాల నిజం చేశాడు శివ దీక్షిత్ . ఒక మారుమూల ప్రాంతమైన కస్తాల గ్రామంలో పేద కుటుంబంలో జన్మించి ఎలాంటి ఆట స్థలం అవకాశాలు లేకున్నా తన స్వయంకృషితో ఆట మీద మక్కువతో నిత్యం ప్రాక్టీస్ చేసి నేడు జిల్లా టీంకు ఎంపిక కావడం విశేషం . భవిష్యత్ లో అంది వచ్చిన అవకాశంతో తను మంచి ప్రతిభ కనబర్చి ఉత్తమ స్థానంలో ఉండాలని అందుకు హెచ్‌సిఏ ఎంపిక దోమదపడాలని ఆశిద్దాం అమ్మనాన్నల ప్రోత్సాహమే .... శివ దీక్షిత్ అమ్మానాన్నలు అందించిన ప్రోత్సాహంతోనే పట్టుదలతో ప్రయత్నం చేశానని ,కృషి ఫలితమే తాను ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టుకు ప్రధాన బౌలర్‌గా ఎంపిక కావడం జరిగిందని శివ దీక్షిత్ తెలిపారు. జట్టులో సభ్యుడుగా ఎంపిక కావడంతో చాలా ఆనందం కలిగించిందని అన్నారు. అ సందర్భంగా శివదీక్షిత్ మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి ఎంపిక చేసిన నల్లగొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సయ్యాద్ అమీనుద్దీన్ ,కోచ్ లు షఫీ,బుచ్చి బాబు లకు ప్రోత్సహించిన అమ్మానాన్నలకు ధన్యవాధాలు తెలియజేశారు. వచ్చిన అవకాశాన్ని సక్రమంగా వినయోగించుకొని రాగల రోజుల్లో తన భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆవాభావం వ్యక్తం చేశారు.

## మహమ్మద్ బడేసాహెబ్ మృతి పార్టీకి తీరని లోటు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన సిపిఎం ఉద్యమ సహచరుడు, మండల కమిటి సభ్యుడు మహమ్మద్ ఖలీల్ తండ్రి మహమ్మద్ బడే సాహెబ్ మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి కామ్రేడ్ యండి. జహంగీర్ అన్నారు. సోమవారం బడే సాహెబ్ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జిల్లా కమిటి సభ్యులు మద్దెపురం రాజు, మండల కార్యదర్శి సత్యనారాయణ, బిక్షం, బాలయ్య, సైదులు, లింగయ్య తదితరులు ఉన్నారు.



## వరి పొలానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు

**ప్రజాపక్షం/మునగాల:** గుర్తు తెలియని వ్యక్తులు వరి పొలానికి నిప్పు పెట్టడంతో సుమారు మూడు ఎకరాల పొలం పూర్తిగా అగ్నికి ఆహుతైనట్లు బాధితుడు తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళితే చిలుకూరు మండలం పొలేనిగూడెం గ్రామానికి చెందిన బత్తిని రామారావుకు చెందిన 11 ఎకరాల పొలంను మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మండవ వెంకన్న కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్నాడు. పొలంను బత్తిని రామారావు తనకు కౌలుకు ఇవ్వలేదనే కోపంతో పక్కనే ఉన్న రైతు ఎవరు లేని సమయంలో నిండు పొలానికి నిప్పు పెట్టడంతో సుమారు మూడు ఎకరాల పొలం ఆగ్నికి ఆహుతైనట్లు బాధితుడు తెలిపారు. సుమారు రెండున్నర లక్షల రూపాయల పంట నష్టం వాటిలినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి తనకు న్యాయం చేయాలని బాధిత రైతు గోడున విలపించారు. ఈ విషయమై చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు మండవ వెంకన్న తెలిపారు.

## మహిళలకు చీరెలు పంపిణీ






**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామానికి చెందిన 40మంది మహిళా సంఘం సభ్యురాలకు సంబంధించిన ఇందిరా మహిళా శక్తి చీరెలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ పూస బాలమనిబాలనరసింహా మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం అంటేనే పేదల రాజ్యమని, స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాటేపల్లి సిద్దమ్మ, వలిగొండ, రామన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోని వెంకటేశం, సింగిల్‌విండో డైరెక్టర్ నాగు ఆంజనేయులు, రామన్నపేట సీసీ వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ గర్దాసు సురేష్ పాల్గొన్నారు. మండలలోని సర్నేనిగూడెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ మహిళా శక్తి చీరెలను మహిళలకు పంపిణి చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అక్కెనపల్లి సుధా, మహిళా సంఘం అధ్యక్షురాలు అడెపు బలమణి, గంగాదేవి, మంగమ్మ, వీబీకేలు ఆడెపు నవ్య, జ్యోతి, మల్లెబోయిన శోభన్‌బాబు పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణ

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ఆంజనేయస్వామి దీక్ష తీసుకున్న స్వాములకు సోమవారం మండల కేంద్రంలోని దుర్గానగర్ ఆంజనేయస్వామి, దుర్గామాత దేవాలయంలో ఆంజనేయస్వాములకు మాజీ వార్డు సభ్యులు కొడిదాల వెంకటయ్య పద్మ దంపతులు, శ్రీసీతారామ చంద్రమౌళీశ్వర దేవాలయంలో ఆంజనేయస్వాములకు ఆర్ఎంపి వైద్యుడు వినయ్ గీత దంపతుల కూతురు అల్లుడు అయిన గంజి కృష్ణ అనూష దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం స్వాములు వారిని ఘనంగా సన్మానించి, ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఆంజనేయస్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/గుండాల;** మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు పోతుందని, అనేక సంక్షేమ పథకాలతో పాటు వడ్డీ లేని రుణాలను అందించి మహిళలను కోటీశ్వరులుగా మార్చే దిశగా చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ముందుకు సాగుతుందని మోత్కూర్ మార్కెట్ డైరెక్టర్ గూడెపు కుమార్ అన్నారు. సోమ వారం మండల పరిధిలోని మర్రిపడిగ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు అందిస్తున్న ఇందరమ్మ చీరల పంపిణి కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలను అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో నాయకులు ఉప్పలయ్య, లక్ష్మీ నారాయణ, వివోలు పాల్గొన్నారు.

## పేద రైతులకు పట్టాలివ్వాలి



**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఎన్నో సంవత్సరాలుగా భూమిని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్న పేద రైతులకు ప్రభుత్వం పట్టాలివ్వాలని కోరుతూ జీడి వీరస్వామి మండల తహశీల్దార్ బి శ్రీకాంత్‌కు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. భూమిని సాగుచేస్తున్న నిరుపేదలకు సాగులో ఉన్న భూమి తమపేరున పట్టా చేసుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై భూమి పట్టా లేకపోవడంతో నిరుపయోగంగా మాత్రం ఉందని అన్నారు. వెంటనే రైతులకు పట్టాలి ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ప్రజావాణిలో అధికారులు ఎంపిడిఓ ఝాన్సీ, పిఆర్ ఏఇ కుమారస్వామి, ఇరిగేషన్ ఏఇ హరిస్వరూప్, ఆర్‌డబ్లుఎస్ ఏఇ నవీన్, పూజశ్రీ, ఎంపిఓ గోపి, ఏపి యు ఉపేందర్ పాల్గొన్నారు.

## ఆదిత్య విద్యార్థులకు మండల స్థాయిలో రెండవస్థానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జేవీవీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చెకుముకి మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ఆదిత్య విద్యార్థులు మండల స్థాయిలో రెండవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ జేవీవీ నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, శాస్త్రీయ వైఖరి పెంపొందిస్తుదన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెరిగి సమాజంలో మూఢ నమ్మకాలను పారద్రోలేలా ప్రోత్సహిస్తుందన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు యామిని, అనన్య, మహేందర్‌రెడ్డిలకు ఆయన జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## సుందరం హోమ్ ఫైనాన్స్ కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అందరికీ ఇల్లు, ఇంటి ఋణం లక్ష్యంగా సుందరం హోమ్ ఫైనాన్స్ అనుగ్రహ అనే హోమ్ లోన్ పథకం ప్రారంభించడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సుందరం ఫైనాన్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రీజినల్ హెడ్ బి. మల్లేశ్వరరావు కోరారు. సుందరం ఫైనాన్స్ లిమిటెడ్, వారి అనుబంధ సంస్థ సుందరం హోమ్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ పట్టణంలోని రామగిరిలో నూతన జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరం హోమ్ ఫైనాన్స్ కార్యాలయాలను తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ తో పాటు సిరిసిల్ల, ఆంధ్ర ప్రదేశ్ లోని జగ్గయ్యపేట లో ఒకే రోజు ప్రారంభించటం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా, తక్కువ ఆదాంయ, ఏ విధమైన ఆదాయ డాక్యుమెంట్ లేని చిన్న వ్యాపార సంస్థలు, చిన్న వ్యాపార సంస్థలు లో పని చేసి జీతం నగదు రూపంలో పొందే వారికి,పూజారులు, నర్సులు, బాడుగ, అద్దె పొందే వారు, డ్రైవర్ లు, ఏ విధమైన



ఇన్కమ్ టాక్స్ లేని చిన్న వ్యాపార సంస్థలు నడిపే వారు గరిష్ఠంగా 40 లక్షల వరకు రుణం అందుబాటులో ఉంటుందని తెలిపారు. నల్లగొండలో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేసినందుకు సీనియర్ మేనేజర్లకు సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోసుందరం ఫైనాన్స్ సీనియర్ మేనేజర్లు, బిల్డర్స్, ఆన్డ్రోమెడా, స్టార్ పవర్, అర్బన్ మనీ కార్పొరేట్ చానల్ పార్టనర్లు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో బిసిలకు అన్యాయం

**ప్రజాపక్షం/చందంపేట**; నల్గొండ జిల్లా చందంపేట మండలం గ్రామ పంచాయతీ జరగబోయే ఎన్నికలలో మండలంలోని 30గ్రామాలలో బిసిలకు అన్యాయం జరిగిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొగిల్ల వెంగలయ్య అన్నారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ త్వరలో జరగబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు దేవరకొండ నియోజకవర్గంలోని బిసిలకు అన్యాయం జరిగిందని, ఉమ్మడి చందంపేట మండలంలో 51 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ రిజర్వేషన్లలో కేవలం బిసిలకు ఒకే ఒక్కటి మాత్రమే కేటాయిచడం చూస్తే రాజకీయంగా బిసిలను అనగతొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనీఫెస్టోలో భాగంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని బిసి నాయకులు పెద్ద ఎత్తున ముందుకు తీసుకువెళ్లి ఎన్నికలు బైకార్డ్ చేయాలని ఆయన అన్నారు.

## నేత్రదానానికి విశేష స్పందన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణం లోని పానగల్ ప్రాంతానికి చెందిన పోలిశెట్టి లక్ష్మీరాజ్యం సోమవారం మృతి చెందడంతో ఈ విషయము తెలిసిన వెంటనే, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్టార్స్ డిస్ట్రిక్ క్యాబినెట్ కమిటీ సభ్యులు లయన్ ఫకీరు వెంకటరెడ్డి,వీరి కుటుంబ సభ్యుల అనుమతితో లయన్స్ క్లబ్ ఆఫ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ డాక్టర్ పుల్లారావు ఆధ్వర్యంలో టెక్నీషియన్ బచ్చలకూర జానీ చే నేత్రదాన ప్రక్రియ ద్వారా కార్నియా అను కంటిపొర లను సేకరించారు.ఈ సందర్భంగా డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ ఇది తమ ఆధ్వర్యంలో జరిగిన 241 వ నేత్రదానం అని, స్వర్గస్తులైన తమ కుటుంబ సభ్యుల నేత్రదానం ద్వారా వారు సజీవంగా ఉంటారనే విశ్వాసం ఇద్దరు నుండి నలుగురు కార్నియల్ అంధులకు కంటిచూపును ప్రసాదించే మహోన్నతమైన అవకాశం తమకు కలుగుతుందనే నమ్మకంతో నేత్రదానానికి అందరూ సహకరిస్తున్నారని తెలిపారు. ఈ నేత్రదానం ద్వారా సేకరించిన మొత్తం 482 కార్నియా కంటి పొరల ద్వారా ఎంతో మందికి కంటి చూపును అందించగలిగే అవకాశం మాకు కలిగినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరనాథ్ కడిమి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ దామర యాదయ్య,కోఆర్డినేటర్లు చంద్రశేఖర్ చిరునోముల,లయన్ కోట సరితను పట్టణ ప్రముఖులు తదితరులు ఉన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/డిండి;** ప్రజాపాలనలో ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. సోమవారం ప్రతాప్‌నగర్ గ్రామ పంచాయతీలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్పుల లక్ష్మీ తిరుపతి హాజరై ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శిరీష, సంఘ బంధం అధ్యక్షురాలు అలివేలు, వీవోఏ, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చివ్వెంల :** కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్‌సి సెల్ చైర్మన్ అమరారపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుంజలూరుతోపాటు చివ్వెంల, ఉండ్రుగొండ గ్రామాల్లో గ్రామ పంచాయితీ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రావణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకరి ఉపేందర్ వర్మ, పెద్ది అంజయ్య గౌడ్, బొల్లికొండ సైదులు, ఐతరాజు రామ్మళ్లు, వెన్న మధుకర్ రెడ్డి, కొనకంచి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల రిజర్వేషన్లను వెంటనే నిలిపివేయాలి

**ప్రజాపక్షం/పాలకీడు :** మండలంలో సర్పంచ్ ఎన్నికల రిజర్వేషన్లను వెంటనే నిలిపి వేయాలని నక్క శ్రీనివాస్ అనే సామాజిక కార్యకర్త తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయితీలు ఉండగా అందులో ఒక గ్రామ పంచాయితీకి కూడా బిసిలకు రిజర్వేషన్ కేటాయించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బిసి జనాభా అధికంగా ఉన్న చోట్ల కూడా జనరల్ రిజర్వేషన్లు కేటాయించడంతో బిసిలకు తీవ్రంగా అన్యాయం జరిగిందని ఆయన లేఖలో రాసుకొచ్చారు. జిఓ 46 ప్రకారం రొటేషన్ పద్ధతుల్లో రిజర్వేషన్ కేటాయింపు జరగలేదని, బిసి డెడికేషన్ కమిటి నివేదిక ప్రకారం బిసిలకు రిజర్వేషన్లను కేటాయించలేదని తెలిపారు. వెంటనే ఈ రిజర్వేషన్లను నిలుపుదల చేస్తూ పునపరిశీలన చేసి కొత్త రిజర్వేషన్లను కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.

## డిండి మండలంలో సర్పంచ్‌ల రిజర్వేషన్లు

**ప్రజాపక్షం/డిండి;** దేవరకొండ నియోజకవర్గంలోని డిండి మండలంలోని గ్రామాల వారిగా సర్పంచ్‌ల రిజర్వేషన్లు బురాన్‌పూర్ తండా (ఎస్టీ జనరల్), హజ్యతండా (ఎస్టీ మహిళ), జాల్ తండా (ఎస్టీ మహిళ), కాటిక బండ తండా (ఎస్టీ మహిళ), నగారాదుబ్బ తండా (ఎస్టీ మహిళ), పడమటితండా (ఎస్టీ మహిళ), రత్న తండా (ఎస్టీ మహిళ), దాక్యతండా (ఎస్టీ జనరల్), కాల్యతండా (ఎస్టీ జనరల్), కొత్తతండా (ఎస్టీ జనరల్), కుందేలుబాయితండా (ఎస్టీ జనరల్), శక్రుతండా (ఎస్టీ జనరల్),ప్రతాప్‌నగర్ (ఎస్టీ మహిళ), సింగరాజుపల్లి (ఎస్టీ మహిళ), బ్రహ్మణపల్లి (ఎస్టీ జనరల్), గదరాల్‌తండా (ఎస్టీ జనరల్), రహమంతాపూర్ (ఎస్సి మహిళ), టి.గౌరారం (ఎస్సి మహిళ), బొగ్గులదోన (ఎస్సి మహిళ), చెర్కుపల్లి (ఎస్సి మహిళ), గోనబోయినపల్లి (ఎస్సి జనరల్), కామేపల్లి (ఎస్సి జనరల్), కందుకూర్ (ఎస్సి జనరల్), బొల్లనపల్లి (జనరల్ మహిళ), దాసరినెమలిపూర్ (బిసి మహిళ), ఖానాపూర్, నిజాంనగర్ (జనరల్ మహిళ), పెద్దతండా (జనరల్ మహిళ), వావిల్‌కోల్ (జనరల్ మహిళ), దేవత్‌పల్లి తండా (జనరల్), గోనకోల్ (జనరల్), శాంతిగూడెం (జనరల్), తవక్లాపూర్ (బిసి జనరల్), ఎర్రగుంటపల్లి (జనరల్), వీరబోయినపల్లి (జనరల్ మహిళ), ఎర్రారం (జనరల్ మహిళ), జేత్యతండా (జనరల్), శేషాయికుంట (జనరల్), డిండి(గుండ్లపల్లి) (జనరల్).

## చీరలు పంపిణీ



**ప్రజాపక్ష/తిరుమలగిరి సాగర్ :** తెలంగాణ ప్రభుత్వం మహిళా స్వయం శక్తి సంఘాల మహిళలు అందించే ఇందిరమ్మ మహిళా చీరలను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఓ పిడి రాజశేఖర్ రెడ్డి అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య అధికారులతో చీరలు పంపిణీ చేశారు,ఈ సందర్భంగా వివో ఏలు చీరలు పంచుతున్న తీరును చూసి సంతోషం వ్యక్తం చేశారు, అనంతరం మహిళలు వారికి శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం రాజేశ్వరి,సంఘం అధ్యక్షురాలు కామేశ్వరి, లక్ష్మమ్మ, వివో ఏలు వరద పాక కలమ్మ,మరియమ్మ, జ్యోతి, రమణమ్మ ,గోవిందమ్మ,మంగమ్మ,జ్యోతి,రేణుక పాల్గొన్నారు.

## జిల్లా టిపిజెఏ నూతన జిల్లా కమిటీ



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ టిపిజేఏ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జీ.భాస్కర్ ఆధ్వర్యంలో భువనగిరిలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా నూతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించి జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు గంధమల్ల రాజు, ఉపాధ్యక్షులు కృపానగరం ఫణిందర్, ఉపాధ్యక్షులు గుజ్జ నరేష్, ప్రధాన కార్యదర్శి దేశ్ పాండే నరసింహ, కోశాధికారి మోగిలిపాక కనక రాజు, సహాయ కార్యదర్శి కర్రె గణేష్, ప్రచార కార్యదర్శిగా కృపా నగరం అభిషేక్, సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు. వీరిని పలువురు అభినందించారు.

# గండూరి ప్రీతమ్ జోన ఫౌండేషన్ సేవలు అభినందనీయం

### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గండూరి ప్రీతమ్ జోన ఫౌండేషన్ ద్వారా సూర్యాపేట పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ విద్యను అభ్యసిస్తున్న వందమంది విద్యార్థులకు ఏకరూప దుస్తులను, ఎగ్జామ్ ప్యాడ్‌లను ఫౌండేషన్ వ్యవస్థాపకులు గండూరి ప్రకాష్ అందజేశారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూనియర్ కాలేజ్‌లోని పేద విద్యార్థులకు యూనిఫామ్‌లను, ఎగ్జామ్ ప్యాడ్‌లను బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గండూరి ప్రకాష్ అందజేయడం పట్ల అభినందనలు తెలిపారు. ప్రభుత్వ కాలేజీలో విద్యార్థులే మానసికంగా ధైర్యంగా ఉంటారని ప్రైవేట్ కాలేజీలో ర్యాంకులు తప్ప వారికి సామాజిక చైతన్యం ఉండదన్నారు. ప్రభుత్వ కాలేజీ ప్రిన్సిపాల్ యాదయ్య మాట్లాడుతూ తాము కోరిన వెంటనే తమ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్ క్లాత్ కొని కుట్టించి ఇవ్వడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. సూర్యాపేటలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని కాని ప్రహరి గోడ లేకపోవడం మూలంగా సెంటర్ రావడంలేదని తెలుపగా ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, మాజీ కౌన్సిలర్ తహేర్‌పాషా, జానీ, వల్దాస్ జానీ, చక్రహరి నాగరాజు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

**- ఈనెల25,26న జాతీయ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మికుల హక్కులను కాలరాసేందుకు, భారత పారిశ్రామిక రంగాన్ని దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని కార్మిక సంఘాల జేఏసి నాయకులు మండిపడ్డారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో కార్మిక నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి 4 చట్టం స్వభావం లేని కోడ్లుగా మార్చడాన్ని సంగరేణి కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. కొత్త చట్టాలను రద్దు చేసి పాత 29 చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికు సంఘాలు ఆందోళనలు చేసినప్పటికీ కేంద్రం పెడచెవిన పెట్టడం దుర్మార్గం అన్నరు. కార్పోరేట్ కంపెనీలకు దారాదత్తం చేసేందుకే కేంద్రం పనిచేస్తోందని ఆరోపించారు. నాలుగు కోడ్లను కార్మిక సంఘాలు అనుమతించవని, వాటిని రద్దుచేయకుంటే యూనియ్లు ఆధ్వర్యంలో ఈనెల 25,26 తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు చేయడంతో పాటు 26వ తేది కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామని, సాయంత్రం సింగరేణి జిఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమాలకు అన్ని సంఘాల కార్యకర్తలు, నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఐటియూసి, ఐఎన్‌టియూసి, సిఐటియూ, టిబిజికేఎస్ నాయకులు సారయ్య, వంగా వెంకట్, రమణ మూర్తి, వీరస్వామి, గట్టయ్య, ఎర్రగాని కృష్ణయ్య, హుమాయూన్, సందెబోయిన శ్రీనివాసరావు, నాయకులు నర్సింహారావు, పీతాంబరం, కాపు కృష్ణ, వెంకటేశ్వర్లు,హుమాయూన్, ఆల్బర్ట్, తుమ్మ శ్రీను, ఐలయ్య, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 29 కార్మిక చట్టాలను రద్దు చేసిన మోదీ ప్రభుత్వం



**ప్రజాపక్షం/ఇల్లందు:** బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాడి దేశానికి స్వతంత్రం వచ్చిన భారత ప్రభుత్వంలో కార్మిక సంఘాల పోరాటాల ఫలితంగా 29 కార్మిక చట్టాలను 1930నుండి 1950 వరకు కార్మికులకు సంక్షేమం కోసం చట్టాలను సాధించుకుంటే నేటి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మిక సంక్షేమ చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నూతన నాలుగు లేబర్ కోడ్‌లు తేవడం దురదృష్టకరమని గుర్తింపు సంఘం ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్ మోడీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఇల్లందు ఏరియాలో అన్ని మైన్స్, డిపార్ట్మెంట్లు, కెఓసి, జెకె 5 ఓసి, ఎస్ అండ్‌పీసీ, సివిల్, ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్, ఏరియా హాస్పిటల్ వద్ద ధర్నాలు నిర్వహించి సంబంధిత అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వర్క్ షాపు వద్ద నజీర్ అహ్మద్ మాట్లాడుతూ 29 కార్మిక చట్టాల వలన దేశంలో కార్మికులకు ఉద్యోగులకు ఎంతో భద్రత ఉన్నదని పరిశ్రమలు అధిపతులకు మానవ శ్రమను దోపిడి చేయకుండా వారు చేస్తున్న పనికి సరైన వేతనము హక్కులను కల్పించడమే ధ్యేయంగా ఉన్న చట్టాలతో ఈనాటి వరకు కార్మిక వర్గం సంతోషంగా ఉంటే, ఈనాటి బిజెపి మోడీ ప్రభుత్వం అ దాని, అంబానీలకు ఊడిగం చేస్తూ పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చే విధం గా కార్మిక శక్తిని బలహీనపరిచేందుకు నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి కార్మికులను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ కొంగర వెంకటేశ్వర్లు, ఎఐటియూసి జిల్లా సమితి సభ్య లు గుగులోత్ కృష్ణ, ఫిట్ కార్యదర్శులు దాట్ల వెంకటేశ్వర్లు, వి జయరాజ్, జక్కుల శ్రీనివాస్, నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డి, కలవల సిద్ధార్థ్, చాంద్ పాషా, చిక్కా శ్రీనివాస్, పెరుగు వెంకటేశ్వర్లు, పి యుగేందర్, అజ్మీరా కిషోర్, సామల శ్రీనివాస్, బట్టు రవి, గుగ్గిల్ల శ్రీనివాస్, చెరుకు సార య్య, వెంకటనర్సయ్య, ప్రసాద్‌రెడ్డి, రాజు, వెంకట్‌రెడ్డి, ఎస్ రవి, కరణాశంకర్, అనిత, రజనీ, చంద్రకళ, శాంతి, జరినా పాల్గొన్నారు.

# పట్టాలో ఉన్న భూమి.. క్షేత్రస్థాయిలో మాయం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పట్టాదారు రికార్డులో ఉన్న తమ భూమి ఎక్కడుందో చూపించాలని రైతు దంపతులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయం ప్రధాన ద్వారం కు అడ్డుగా పడుకుని విన్నూత నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం లోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన కొలిపాక రామదాసు, భారతమ్మ దంపతులకు సర్వే నెంబర్ 229 లో 2 ఎకరాల 36 కుంటల భూమి ఉంది. ఇందుకు సంబంధించిన రికార్డులు ఉన్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో భూమి దాదాపు 36 కుంటల భూమి తక్కువగా ఉందని "పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ కు చెందిన 2.26ఎకరాలకు హద్దులు నిర్ణయించాలని బాధితులు మండల, జిల్లా అధికారులను పలుమార్లు కలిసి గోడు వినిపించారు. అధికారులు స్పందించకపోవటంతో చివరకు హైకోర్టు ను కూడ ఆశ్రయించారు. సర్వే చేసి క్షేత్ర స్థాయిలో భూమి ని చూపించాలని న్యాయ స్థానం అధికారులను ఆదేశించింది. ఈ మేరకు గతంలో జిల్లా సర్వేయర్, అధికారులు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించారు. బాధితులు తమకు వెంటనే న్యాయం చేయాలని సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కు దిగారు. ప్రధాన ద్వారం కు అడ్డుగా పడుకుని విన్నూత నిరసన వ్యక్తంచేశారు. తమకు మా భూమి ని అప్పగించే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యాలయం అధికారులు వచ్చి తహశీల్దార్ రాగానే సమస్య ను వివరించండి అని నచ్చచెప్పటంతో ఆందోళన విరమించారు. తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు ను వివరణ కోరగా భూమి కి సంబంధించిన 36 కుంటల భూమి గువ్వలగూడెం ముజ్జుగూడెం రహదారి నిర్మాణంలో కలిసిందని సర్వేయర్ లు నివేదిక ను అందించార ని తెలిపారు.

# ఘనంగా యుగేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రానికి చెందిన మాజీ జెడ్పిటిసి సలహాదారుడు, కాంగ్రెస్ నాయకులు పసునూరి యుగేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మన కార్యాలయం మనందరి కార్యాలయంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డిల సమక్షంలో, యుగేందర్‌రెడ్డి కాంప్లెక్స్, ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయనతో కేక్ కట్ చేయించారు. చౌరస్తాలో బాణాసంచా పేల్చారు. పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, శాలువాలతో సన్మానించి, బోకేలు అందజేశారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ



**ప్రజాపక్షం/మునుగోడు:** రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచుల కోసం ఇందిరా మహిళా శక్తి పేరుతో చీరలను పంపిణీ చేస్తుంది అందులో భాగంగాసోమవారం ఎలగలగూడెం గ్రామంలో ఆ గ్రామ మహిళలకు సిపిఐ నాయకులు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నాణ్యతలేని చీరలను పంపిణీ చేసి మహిళలను అగౌరపరిచారని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతిని పెంచాలని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం నాణ్యత కూడిన చీరలను పంపిణీ చేస్తుందని అన్నారు.కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సురిగి చలపతి,పంచాయతీ కో ఆప్షన్ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు,ఈదుల కంటి కైలాస్,మాజీవార్డు మెంబర్ కట్కూరి లింగస్వామి,వెలుగు సిసి శంకర్,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు బిక్ష



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూరు మండలం నాంచారి పేట గ్రామ వాస్తవ్యులు కంది శశిధర్ రెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ కంది చంద్రకళ వెంకట్ రాంరెడ్డి నాగారంలోని స్వగృహంలో అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి కంది అనిల్ కుమార్ రెడ్డి, ఫౌండేషన్ డైరెక్టర్స్ కంది శ్వేతా రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, కంది తారా రెడ్డి, ఏనుగు శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# నూతన కార్మిక కోడ్‌లను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కేంద్రప్రభుత్వం తీసుకువొచ్చిన నూతన కార్మిక కోడ్ లను రద్దుచేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని మెడికల్ రిప్రెసెంటేటివ్ అధ్యక్షులు పాల్వాయి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. పాత కార్మిక చట్టాలని పునరుద్ధరించి కార్మికుల భవిష్యత్తును కాపాడాలని కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మెడికల్ రిప్రెసెంటేటివ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక కోడ్లతో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని వెంటనే రద్దుచేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సోమ స్వామి,కోశాధికారి అనుదీప్,ఉపకార్యదర్శి తాజుద్దీన్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోట సుధాకర్,జాయింట్ కన్వీనర్ రమేష్ ,శ్రీనివాస్,మనోజ్,సాయికిరణ్ పాల్గొన్నారు.

# కార్మికులను కొట్టి కార్పోరేట్లు పెడుతున్న మోడీ

**ప్రజాపక్ష/తిరుమలగిరి సాగర్ :** కార్మికుల కష్టాన్నదోచి కార్పొరేట్ సంస్థల యాజమాన్యాలకు జేబులు నింపుతున్న నరేంద్ర మోడీ విధానాలను ఎండగట్టాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అవుతా సైదులు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సోమవారంతిరుమలగిరిలో మండల కేందర్రంలో నిర్వహించిన సిఐటియు రెండో మండల మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం నూతన తిరుమలగిరి సిఐటియు మండల కన్వీనర్‌గా షేక్ చాంద్ పాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీర్, అనుమల మండల కన్వీనర్ రేబెల్లి వెంకటేశ్వర్లు ,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జటావత్ రవి ,గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు వేములకొండ పుల్లయ్య,నాయక్ ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు జగదీష్, అలివేలు తావూరియా,సర్దార్,లక్ష్మణ్,శోభ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రశంసనీయం

**- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నిరుపేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ పథకం ప్రశంసనీయమని, గత ప్రభుత్వానికి భిన్నంగా చీరలు అందించి మహిళలకు సామాజిక గౌరవం పెంపొందేలా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి, లక్ష్మీ దేవిపల్లి మండల గ్రామీణ మహిళలకు ఎన్‌కే నగర్ కమ్మ కళ్యాణ వేదికలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుజాతనగర్ గ్రామీణ మహిళలకు మండలంలోని రైతువేదికలో చీరలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను మోసే మహిళలను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మహిళల విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన వంటి అంశాలను ప్రభుత్వం ఇంకా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధిలో కొత్తగూడెం నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతున్నామని, ప్రతి పల్లె, బస్తీలో మౌళిక వసతుల కల్పన పూర్తి చేశామని చెప్పారు. భారీ తరహా ప్రాజెక్టులు పూర్తి చేస్తున్నామని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్ పాషా, ఆర్డీవో మధు, చుంచుపల్లి తహశీల్దార్ కృష్ణ, లక్ష్మీ దేవిపల్లి తహశీల్దార్ శిరీష, నాయకులు వాసిరెడ్డి మురళీ, సలిగంటి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మండే వీరహన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# 26న జరిగే నిరసన ర్యాలీలను జయప్రదం చేయండి : శింగు




**ప్రజాపక్షం/ఖమ్మం :** నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష కార్మిక, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 26న దేశ వ్యాప్తంగా నిర్వహించే నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పిలుపునిచ్చారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ఏఐటియుసి కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో శింగు నర్సింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోడీ పైకి కార్మికుల కోసం, కర్షకుల కోసం చట్టాలు తేస్తున్నామని చెబుతున్నప్పటికీ ఇవి కేవలం కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించేలా ఉన్నాయన్నారు. పోరాడి సాధించుకున్న 40 కార్మిక చట్టాలను వివిధ కోడ్‌ల రూపంలో తీసుకువచ్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. 11 ఏళ్ల నరేంద్ర మోడీ పాలనలో రైతులకు, కార్మికులకు చేసింది ఏమి లేదన్నారు. ఉపాధి హామీ పథకం చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఈనెల 26న జరిగే దేశ వ్యాప్త నిరసన ర్యాలీని జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సీతామహాలక్ష్మి, ఎండి జాకీరుద్దీన్,షేక్ చాంద్‌పాషా, బుచ్చిబాబు, నంబూరి శంకర్ రావుపాల్గొన్నారు.

# చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించాలి

**-అవగాహన కార్యక్రమంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చేనేత వస్త్రాలకు ఆదరణ కల్పించేందుకు రూపొందించిన చేనేత లక్ష్మి పొదుపు స్కీంను ప్రజలందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం చేనేత లక్ష్మి పథకంపై జిల్లా అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వం చేనేత లక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ బట్టల కొనుగోలుకు నెలకు కొంత డబ్బు పొదుపు చేసుకునే అవకాశం కల్పించిందని తెలిపారు. చేనేత లక్ష్మి పథకం క్రింద నెలకు రూ. 500 చొప్పున తొమ్మిది నెలలు పొదుపు చేస్తే ప్రభుత్వం 10వ నెల ముగిసిన తర్వాత 60 శాతం కలిపి టెస్కో షోరూం నుంచి బట్టల కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందన్నారు. టెస్కో షోరూం ద్వారా బట్టల కొనుగోలు చేయడం వల్ల చేనేత కార్మికులకు ఎంతో మేలు చేయగలుగుతామన్నారు. ఆసక్తి గల జిల్లా అధికారులు, సిబ్బంది టెస్కో అందించే చేనేత లక్ష్మి పథకాన్ని వినియోగించుకుని నాణ్యమైన బట్టలు కొనుగోలు చేయాలన్నారు. టెస్కో షోరూం ఖమ్మం నగరం కస్బాబజార్ జివి మాల్ వెనక ఉందని ఉద్యోగులు, ప్రజలు సందర్శించి చేనేత లక్ష్మి స్కీంలో చేరేందుకు ఆసక్తి చూపాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా హ్యాండ్లూమ్స్ ఏడి, టెస్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి వెంకటేశ్వర్లు చేనేత లక్ష్మి పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, మేనేజర్ సంతోష్‌కుమార్, అసిస్టెంట్ మేనేజర్ జరీనా, ప్రతినిధులు ఎల్లాస్వామి పాల్గొన్నారు.

# పాలకులారా పేద ప్రజల గోడు పట్టించుకోరా..!

**- ఏడవ రోజుకు చేరిన నిరసన దీక్ష**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట సర్వే నెంబర్ 1228 లో ప్రభుత్వ భూమిలో పేద ప్రజలు నిర్మించుకున్న గుడిసెలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిన అమానవీయ చర్యకు వ్యతిరేకంగా సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష సోమవారం ఏడవరోజుకు చేరింది. పాలకులు, అధికారులు దిగివచ్చి నష్టపోయిన పేద ప్రజలకు న్యాయంచేయాలని చేపట్టిన ఈ దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు తెలియచేస్తూ సిపిఐ, పేద ప్రజలు చేసే పోరాటంలో వారికి మద్దతుగా తామందరం నడుస్తామని తెలిపారు. అశ్వారావుపేటలో భూ స్వాముల ఆధీనంలో కొన్ని వందల ఎకరాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలు కష్టపడి గుడిసెలు నిర్మించుకుని ఐదారు సంవత్సరాలుగా నివసిస్తున్న తరుణంలో వాటిని కూల్చేవేయడం క్రూరమైన చర్యగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పాలకులు, అధికారులు ఇప్పటికైనా మేల్కొని నష్టపోయిన ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించి వారికి నష్టపరిహారాన్ని ఇవ్వాల్సిందిగా సిపిఐ పార్టీ శ్రేణులు, బాధిత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అశ్వారావుపేటలో భూస్వాముల ఆధీనంలో ఉన్న వందల ఎకరాల ప్రభుత్వ భూమి లెక్కలు తేల్చే వరకు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపట్టిన ముందుకు తీసుకెళ్తామని సిపిఐ శ్రేణులు హెచ్చరించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం మాట్లాడుతూ గత ఐదారు సంవత్సరాలుగా పేద ప్రజలు సర్వేనెంబర్ 1228లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తూ వస్తున్నారని, పేద ప్రజల ఇళ్లను దౌర్జన్యంగా ఎటువంటి సమాచారం లేకుండా ప్రభుత్వం, అధికారులు, పోలీసులు కూల్చేయటం దుర్మార్గపు చర్య అని అన్నారు. ఒక పక్క ప్రభుత్వం పేద ప్రజలు ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకుంటే వాటిని తొలగించవద్దని చెబుతున్నా అశ్వారావుపేట కాంగ్రెస్ నాయకులు దానిని పక్కన పెట్టి వారి ఇష్టారాజ్యంగా పేదల ఇళ్లను కూల్చి వేస్తూ దౌర్జన్యానికి తెగబడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా పేదలకు ప్రత్యామ్నాయం చూపించి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు, నష్టపోయిన ప్రజలు పాల్గొన్నారు.

# విధులను పకడ్బందీగా నిర్వర్తించాలి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విధులను అధికారులు జవాబుదారితనంతో పకడ్బందీగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులుగా విధులు నిర్వహిస్తున్న జిల్లా అధికారులు సంబంధిత మండలంలోని పాఠశాలలను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేయాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజావాణికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం మండల ప్రత్యేకాధికారులు పాఠశాలలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి అందించిన ఫీడ్‌బ్యాక్ నివేదికలను తీసుకోవాలని కలెక్టర్ డిఆర్‌వోకు సూచించారు. ప్రతి జిల్లా అధికారి తనకు కేటాయించిన పాఠశాలలను తనిఖీ చేస్తూ ఆహార నాణ్యత, కిచెన్ పరిసరాలను మెరుగుపర్చాలన్నారు. జిల్లాలో మంత్రులు, వివిఐపి కార్యక్రమాల సమయంలో ప్రోటోకాల్ తప్పిదాలు ఉండవద్దని, వివిఐపి కార్యక్రమాల షెడ్యూలింగ్ పక్కాగా చేసుకోవాలన్నారు. జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం క్షుణ్ణంగా ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు అందజేయాలని జిల్లా అధికారులు తమ వద్ద ఈ సమాచారం ఎప్పుడు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ రాబోతుందని జిల్లా అధికారులు తమ పరిధిలోని సిబ్బంది ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించేలా అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల విధులలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఉండటానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా అధికారులు, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ఇచ్చిన ప్రతి మాటను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుంది..

**నూతి సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలిపిన మురళి**



**ప్రజాపక్షం/వైరా:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తుంది. బిసిల అభివృద్ధికి కట్టుబడి ఉంది. బడుగు, బలహీన వర్గాలకు పెద్ద పీట వేస్తుందని వైరా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వేల్పుల మురళి అన్నారు. బిసి సామాజిక వర్గం నేత నూతి సత్యనారాయణకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి లభించడం పట్ల ఆయనను కలిసి శుభాకంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేల్పుల మురళి మాట్లాడుతూ బడుగు, బలహీర వర్గాలకు కాంగ్రేస్ పెద్ద పీట వేస్తుందని సంక్షేమ పథకాల్లో అదేవిధంగా పార్టీ పదవుల పంపకంలో నామినేటెడ్ పదవుల్లో బిసిలకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ద్వారానే ఈ దేశం ఈ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల వద్దకు చేరవేస్తూ గడిచిన రెండు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం మరింత పేద ప్రజలకు చేయూతనిచ్చిందని, ఉద్యోగ నియామకాల విషయంలో యువతకు పెద్ద పీట వేసిందని, అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం తన మార్క్ చూపిస్తుందని ఆయన అన్నారు. సత్యనారాయణ సారధ్యంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు.

# సీసీ రోడ్డు నిర్మించాలని వినతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సోంపల్లి గ్రామంలో తమ వీధిలో సీసీ రోడ్డు నిర్మించాలని సిపిఐ నాయకులు బర్ల వెంకటేశ్వర్లు పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లకు సోంపల్లి గ్రామంలో సోమవారం వినతి పత్రం అందించారు. తక్షణమే స్పందించిన పాయం వెంకటేశ్వర్లు పంచాయితీ రాజ్ ఏఈ చారిని పిలిచి ఎస్టిమేషన్ వేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ స్పందించిన తీరుపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు గ్రామస్తులు పలు సమస్యలపై వినతులను అందించారు. ఎంపీడీవో జమలారెడ్డిని పిలిచి పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఓ వికలాంగుడు తనకు వీల్ చైర్ అందించినందుకు కృతజ్ఞతలతో ఎంఎల్ఏ పాయంను శాలువాతో సత్కరించేందుకు ప్రయత్నించగా ఆ శాలువాను వికలాంగునికి అందించి భరోసా అందించారు.

# స్మశానవాటికకు రహదారి నిర్మించాలి



**ప్రజాపక్షం/ఏన్కూరు :** మండల కేంద్రమైన ఏన్కూరు స్మశాన వాటికకు రహదారికి సీసీ రోడ్డు నిర్మించాలని సోమవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్మశాన వాటికకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి మెయిన్ రోడ్డు మీదుగా వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. ఆధ్వానంగా ఉన్న రోడ్డు బాగు చేయించి సిసి రోడ్డు నిర్మాణం చేస్తే గ్రామస్తులకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామస్తులు తెలిపిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణం జరిగేలా చూడాలని అన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామస్తులు మేడ ధర్మారావు, మాదినేని లెనిన్, కట్ట సత్యనారాయణ, దారా చక్రి, మాదినేని నరసింహారావు ఉన్నారు.